# IMMANUEL BIBLE COLLEGE
CHRISTIANPET NIDUBROLU



# "నీతిమంతులకు శ్రమలెందుకు"

## (యోబుగ్రంథ సంగ్రహ సమీక్ష)

## I. ఉపోద్ఘాతము :

**యోబు గ్రంథ రచయిత :** ఎవరో తెలియదు. కాని కొంతమంది వక్తల, గ్రంథ వేదాంతుల పరిశోధనల్లో వెల్లడించబడిన అభిప్రాయాల్ని బట్టి, ప్రధానంగా మోషే అయి ఉండొచ్చని అంచనా. మరి కొంతమంది ఎజ్రా, సొలొమోను, లేక 'యోబు' తానే వ్రాసాడని ఒకవేళ ఎలీహు అయిఉండొచ్చని తమ తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు.

**వ్రాసిన కాలం :** ఈ గ్రంథం వ్రాయబడిన కాలం కూడా తెలియదు. కారణం, అసలు యోబు, ఏకాలంలో, ఎక్కడ జీవించాడో కూడా సరైన వివరాలు లేవు. మన పితరుడైన అబ్రాహాము జీవించిన కొద్దికాలానికి యోబు జీవించి ఉండవచ్చని, మోషే, ఎజ్రా కాలాల మధ్యలో గాని, లేదా సొలొమోను పరిపాలన చివరి కాలంలో గాని ఈ గ్రంథం వ్రాయబడి ఉండొచ్చని అంచనా, ఈ గ్రంథంలో మోషే ధర్మశాస్త్రమును గూర్చిన విషయాలేమి లేవు గనుక నిర్గమ కాండానికి ముందే అనగా మన పితరుల కాలంలోనే, బహుశా క్రీస్తు పూర్వము 1800–1500 సం॥ల మధ్య కాలంలోనే వ్రాయబడి ఉంటుంది. యోబు చరిత్ర పితరుల కాలానికి సంబంధించినదనడానికి కొన్ని ఆధారాలున్నాయి.

1. పితరులలాగే యోబు దీర్ఘకాలం జీవించాడు. యోబు తిరిగి సమకూర్చబడిన తరువాత ఇంకా 140 సంవత్సరాలు జీవించాడు (యోబు 42:16).
2. యోబు తన కుటుంబములో యాజకునిగా వ్యవహరించాడు. ఈ గ్రంథంలో ఇశ్రాయేలు సంతానమును గూర్చిగాని, యాజకులను గూర్చి గాని ఏమి వ్రాయబడలేదు గనుక వారందరి కంటే ముందే సంభవించినది.
3. ఎలీఫజు, ఏశావు జ్యేష్టకుమారుడు (ఆది.కా.36.10). దీనిని బట్టి యోబు యాకోబు సమకాలికుడని అనుకోవచ్చును.

**వ్రాయబడిన ఉద్దేశం :** యోబు గ్రంథంలో గొప్ప తత్వశాస్త్రము ఇమిడి ఉంది. ఈ గ్రంథంలో అనేక సమస్యలు తలెత్తినవి మరియు పరిష్కరించబడినవి.

1. ఈ గ్రంథం నీతిమంతులకు శ్రమలెందుకు? అన్న ప్రశ్నను కలిగిస్తుంది. నీతిమంతులు శ్రమపడ్డానికి గల ఒక కారణాన్నిఈ గ్రంథం వివరిస్తుంది. అయితే ఇదొక్కటే ఈ గ్రంథంలోని ప్రధాన బోధనాంశం అనుకోకూడదు.
2. మానవాళిపై సాతాను చేస్తున్న నేరారోపణలను ఎదుర్కోడానికి యోబు గ్రంథం వ్రాయబడింది.
3. యోబు ఏమైయున్నాడో అతనికి ప్రత్యక్షపరచబడుటకు ఈ గ్రంథం వ్రాయబడింది.
4. యోబు గ్రంథం సహనాన్ని గూర్చి బోధిస్తుంది (యాకోబు 5:11) వాస్తవంగా, యోబు సహనశీలిగా కనిపించకున్నా, పుస్తకం చివరి భాగానికి వచ్చేసరికి అతని సహనాన్ని అర్థం చేసుకోగలుగుతాం.
5. మారుమనస్సును గూర్చి బోధించడమే ఈ గ్రంథ ప్రధాన ఉద్దేశం అని కూడా చెప్పుకోవచ్చును.

**ఈ గ్రంథంలో ప్రధాన సూత్రధారులు :**
యోబు, ఎలీఫజు, బిల్దదు, జోఫరు, ఎలీహు. (ఇక దేవుడు – సాతానుడు కూడా మనకు పరోక్షంగా కన్పిస్తూనే ఉంటారు).

**ఈ గ్రంథ సారాంశం :**
యోబుగ్రంథం హెబ్రీ భాషలో వ్రాయబడిన మొదటి పద్యగ్రంథం. అందుకే కొంతమంది ఇది బైబిల్లో వ్రాయబడిన మొదటి పుస్తకం అని భావిస్తుంటారు. ఈ గ్రంథంలో, సాతాను ఎంత కుయుక్తి పరుడో, వాడు ఏ విధంగా ఈ భూలోకంలో తన కార్యకలాపాలు కొనసాగిస్తూ ఉంటాడో (యెహె.14:14,20) గమనించగలం. క్రైస్తవులకు శ్రమలెదురైనపుడు ఎలా స్పందించాలో, ఓర్పువహిస్తూ ఆ శ్రమల్లో నుండి కడతేరే వరకు దేవుని మీదే ఎలా ఆధారపడాలో తెలుసుకోగలం (యాకోబు 5:11). ఇక మనం ఏదైనా శ్రమకు గురైనపుడు, మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లు, మనవాళ్ళే మనలను ఎలా ఎత్తిపొడుస్తారో కళ్ళకు కట్టినట్లు మనం చూడవచ్చు. అయితే నమ్మదగిన దేవుడు విశ్వాసి జీవితంలో ఎటువంటి పరిస్థితిరానిచ్చినా, అది మనకు మేలు జరిగేందుకే అనుమతిస్తూ, ఆయన యందే సాగిపోయేవారికి అట్టి ప్రతికూల పరిస్థితులన్నిటిని చివరికి గొప్ప ఆశీర్వాదంగా మార్చివేస్తాడనే ప్రోత్సాహకరమైన పాఠాన్ని మనం నేర్చుకోగలం. **ఈ గ్రంథమంతటికి మూలవాక్యం – యోబు 2:3.**

## II. యోబు గ్రంథంలో 3 ముఖ్యభాగాలు (దృశ్యాల వారీగా) :

ఈ గ్రంథం నిజానికి ఒక నాటక రూపంలో పద్య, గద్య, సంభాషణలుగా వ్రాయబడింది. ఆ కోణంలో యోబు గ్రంథాన్ని చదివినట్లైతే మూడు ప్రధాన భాగాలు మనకు కనిపిస్తాయి.

**1. నాటక రూపంలో వ్రాయబడిన గద్యభాగం (1-2:1-10) :**

**ఎ) మొదటి దృశ్యం** : ఊజుదేశం, యోబు అభివృద్ధి, నెమ్మదితో కూడిన జీవితము (1:1-5).

**బి) రెండవ దృశ్యం** : పరలోకము, సాతాను దేవుని వద్ద యోబుపై నేరారోపణ చేయడం (1:6-12).

**సి) మూడవ దృశ్యం** : ఊజు దేశం, యోబు తన సంతానాన్ని, సంపాదనను కోల్పోవుట (1:13-22).

**డి) నాల్గవ దృశ్యం** : పరలోకం, దేవుడు, సాతాను (2:1-6).

**ఇ) ఐదవ దృశ్యం** : ఊజుదేశం, యోబు ఆరోగ్యం కోల్పోవుట యోబు భార్య విచారం వ్యక్తం చేయుట (2:7-10).

**2. సంభాషణ రూపంలో వ్రాయబడిన పద్యభాగం (2-11-42:6) :**

**ఎ) ఆరవ దృశ్యం** : పట్టణపు దిబ్బ (2:11-37:24).

1. యోబు స్నేహితులు అర్థం చేసుకోలేక పోవుట (2:11-13).
2. యోబుకు, ఎలీఫజు, బిల్దదు, జోఫరుల మధ్య భేటీ (3:1-32:1).
3. యోబుకు ఎలీహుకు మధ్య భేటీ (32:2-37:24).

**బి) ఏడవ దృశ్యం** : యెహోవా దేవుడు, యోబుకు మధ్య భేటీ (38:1-42:6).

**3. ముగింపుగా వ్రాయబడిన గద్యభాగం (42:7-17) :**

**ఎనిమిదవ దృశ్యం** : ఊజుదేశం, యోబుకు కల్గిన రెండంతల ఆశీర్వాదాలు.

**ఎ) మొదటి దృశ్యం (1:1-5) :**

**ఊజుదేశం, యోబు అభివృద్ధి, నెమ్మదితో కూడిన జీవితం :**

**యోబు కుటుంబ సభ్యుల వివరాలు :** యోబుకు భార్య, ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. యోబు తన కుటుంబంపట్ల ఎంతో బాధ్యత కల్గిన యజమానిగా ఈ భాగంలో మనం తెలిసికోగలం. ప్రత్యేకించి వారి ఆధ్యాత్మిక జీవితం క్షేమం కోరినవాడై వారి గురించి ఎంతో శ్రద్ధ వహిస్తూ, ఒకవేళ వారు తెలియక ఏదైనా పాపము చేసారేమో అని వారి పాపపరిహారం నిమిత్తం, ప్రతి దినం ప్రతి ఒక్కరి కోసం దహన బలి అర్పిస్తూ వచ్చాడు. ఈ విధానంలోనే నేటి తల్లిదండ్రులు తమ బిడ్డల పొరపాట్లు క్షమించబడు నిమిత్తం, వారి ఆధ్యాత్మిక ఎదుగుదలనిమిత్తం, వారి భద్రత నిమిత్తం, వారు తమ ప్రభువును సంతోష పెట్టే నిమిత్తం జీవింపచేయమని దేవునికి విజ్ఞాపనలు చేసేవారుగా ఉండాలి. అనుదినం మీరు కుటుంబ ప్రార్థనా సమయాన్ని కలిగి ఉంటున్నారా?

**ఆస్తి వివరాలు :** ఆ దినాల్లో యోబుకున్న ఆస్తి మొత్తం ఈనాటి రూపాయల్లో సుమారు 400 కోట్లు (సామె. 10:22). కాని కొన్ని క్షణాల్లోనే ఆ ఆస్తి అంతా ధ్వంసమైపోయింది. అయినా యోబు ఏమన్నాడో మీకు తెలుసుగదా!

**"యెహోవా ఇచ్చెను, యెహోవా తీసికొనిపోయెను**
**యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక!"**

యోబు మనసు అంతా తనను సృజించిన దేవునిపైనేగాని తాను సంపాదించిన ఆస్తి మీద పెట్టలేదు. కాబట్టే యోబు ఆ మాట పలుక గలిగాడు, ధైర్యంగా ఉండగలిగాడు. నీ మనస్సు ఎక్కువగా, లేక పూర్తిగా దేనిపై నిలుపుతున్నావు? నీ ఆస్తి మీదా? దేవుని మీదా?

**బి) రెండవ దృశ్యం (1:6-20)**

**పరలోకము, సాతాను దేవుని వద్ద యోబుపై నేరారోపణ చేయడం :**

సాతాను గురించి తెలుసుకోవలసిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు :

1) సాతాను దేవునికి లెక్క అప్పగించవలసినవాడు.
2) సాతాను ఎవరిని శోధింపచూస్తున్నాడు అనేది దేవునికి ముందే తెలుసు.
3) సాతాను ఒకసారి ఒకే స్థలంలో ఉండగలడు.
4) సాతాను, వాడి అనుచరులు ఎల్లప్పుడు దేవునికి విరుద్ధమైన పనిలో నిమగ్నమై ఉంటారు. అయితే ప్రతి విషయంలో వారికి పరిమితులు ఉన్నాయి. దేవుడు అనుమతించనిదే వారు ఏ విశ్వాసి సరిహద్దులను దాటి రాలేరు.
5) సాతాను మన మనసులోని మాటను గ్రహించలేడు.
6) సాతాను ఇక ముందు ఏమి జరగబోతుందో ఊహించలేడు.
7) మరొక ప్రాముఖ్యమైన, ప్రోత్సాహకరమైన సత్యం ఏమంటే సాతానుదాదులను దేవుని ప్రజలు, దేవుని శక్తితో ఎంతో అవలీలగా జయించగలరు.
8) సాతాను అంటే ఏదో భ్రమకాదు. వాడు నిజంగా ఉన్నాడు. ఈ భూమ్మీద ఎప్పుడు అటూ, ఇటూ తిరుగుతూ ఉంటాడు. అయితే లోకములో ఉన్న ఈ సాతానుకంటే దేవుడు గొప్పవాడు (I యోహాను 4:4).

ఇక దేవునికి, సాతానుకు మధ్య సంభాషణ మనకు నేర్పించే గొప్ప సత్యం ఏమిటంటే, సాతాను యోబుపై, లేక మనపై చేసే ప్రతి ప్రయత్నం దేవునికి ముందే తెలుసు, కాని మనం అర్థం చేసికోలేని, ఏదో ఒక ప్రత్యేక కారణాన్ని బట్టి దేవుడు ఇట్టి శ్రమల

ద్వారా మనల్ని వెళ్ళనిస్తాడు. అయితే అట్టి సమయంలో ఆయన ఎంతో కనికరం, దయ, జాలి చూపించేవాడుగా ఉంటాడు.

**సి) మూడవ దృశ్యం (1:3–22)**

**ఊజు దేశం, యోబు తన సంతానాన్ని సంపాదనను కోల్పోవుట :**

1. **యోబుపై ముంచుకొచ్చిన గొప్ప విపత్తులు :** ఈ భాగంలో యోబుకు కలిగిన విపత్తుల ద్వారా నాలుగు రకాల నష్టాన్ని పొందాడు.

ఎ) 1:13–15 : ఉత్తర అరేబియా ప్రాంతం నుండి షెబాయీయులు అనే తెగవారు వచ్చి ఎద్దులు, గాడిదలను పట్టుకొని పోవడం, వాటి పని వారిని హతం చేయడం.

బి) 1:16 : ఆకాశం నుండి దేవుని అగ్ని గొఱ్ఱెలను, పని వారిని, కాల్చివేయడం. దేవుని అగ్ని అంటే సృష్టిలో దేవుడు కలుగజేసిందే, ఇది ఒక వర్ణనగా వ్రాయబడిందే గాని, దేవుడు కురిపించిన అగ్ని కాకపోవచ్చు. అయితే దేవుని సృష్టిలోని వాటిని సాతానుడు కూడా వాడే అవకాశాలున్నాయి (ప్రకటన 13:13). కాబట్టి ఒక శక్తివంతమైన పిడుగు పాటువలన 7000 గొఱ్ఱెలు, పనివారు కాల్చివేయబడేందుకు దేవుడు అనుమతించాడు.

సి) 1:17 పారశీక దేశానికి ఉత్తర భాగంలో నివసించే కల్దీయులనేవారు 3 గుంపులుగా వచ్చి 3000 ఒంటెలను తీసుకుపోవడం, పనివారిని హతమార్చడం.

డి) 1:18–19 సుడిగాలి ప్రభావం వల్ల ఇల్లు కూలి భోజనం చేస్తున్న యోబు కుమారులు, కుమార్తెల మీద పడగా ఆ 10 మంది సంతానం మరణించడం.

2. **తనకు కలిగిన విపత్తులలో యోబు స్పందించిన విధానం (1:20–2) :** ఈ వచనాల్లో బైబిల్లోనే అతి ప్రాముఖ్యమైన సందర్భం మనకు కన్పిస్తుంది. అదే 21వ వచనం. **"నేను నా తల్లి గర్భంలో నుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్ళెదను, యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొని పోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక!".**

ఈ మాటలు పలికేముందు యోబు తనకు కలిగిన దుఃఖాన్ని దాచుకోలేదు సుమా! అదే సమయంలో తన విశ్వాసాన్ని కూడా జారవిడచుకోలేదు. అయితే 20వ వచనంలో తాను స్పందించిన విధానం, తాను ఒక మానవ మాత్రుడేనని, తన కుటుంబాన్ని ఎంతగా ప్రేమించాడో అనేది తెలియపరుస్తుంది.

సాతానుడు పెట్టిన మొదటి పరీక్షలో యోబు తన ఆస్తి పాస్తులను, తన కుటుంబాన్ని పోగొట్టుకొన్నాడేగాని, దేవుని దృష్టిలో తన యథార్థతను మాత్రం పోగొట్టుకోలేదు. తద్వారా దేవుడు యోబుకు అనుగ్రహించిన దాని అంతటి మీద ఆయనకు సర్వాధికారం ఉంది అనే సంగతిని వ్యక్తం చేసాడు. అంతమాత్రమే కాదు, **"దేవుడు తన బిడ్డలకు ఏమి ఇచ్చాడు అనేదాన్నిబట్టే కాదు, దేవుడు ఎవరై ఉన్నాడు అనే దాన్నిబట్టే ప్రజలు ఆయన్ని ప్రేమించగలరు"** అనే సత్యాన్ని ఋజువు చేసాడు. ఈ పరీక్షలో యోబు 100% గెలిచాడు.

**డి) నాల్గవ దృశ్యం (2:1–6) – పరలోకం, దేవుడు, సాతాను :**

యోబుకు ఎదురైన 2వ పరీక్ష (2:1–8). ఈ పరీక్షలో యోబు భౌతికపరమైన ఆరోగ్యాన్ని దెబ్బతీసేందుకు సాతానుడు ప్రయత్నిస్తున్నాడు. నిజానికి మొదట 1:12లో దేవుడు – అతనికిమాత్రం ఏహాని చేయకూడదని అపవాదికి సెలవిచ్చాడు. కాని ఇప్పుడు ఈ రెండవ పరీక్షలో యోబు ప్రాణం తీయడం మినహా మరేదైనా చెయ్యడానికి అపవాదికి అనుమతినిచ్చాడు అంటే అర్థం, దేవుని ప్రణాళికలను అపవాది అవలీలగా మార్చేయగలడు అని కాదు, గాని ఆరోగ్యం సహితం పూర్తిగా క్షీణింపచేసేటంత శ్రమ వచ్చినా, యోబు తన యథార్థత వదలడని, ముఖ్యంగా తాను నమ్మిన దేవున్ని విడచిపోడని, దేవునికి ముందుగానే తెలుసు. కాబట్టే యోబును శ్రమ పెట్టేందుకు దేవుడు అపవాదిని ఆ మేరకే, అనుమతించాడు. యోబుకు సంభవించిన శ్రమలు ఒక పరీక్షగా, సాతానుకు గుణపాఠంగా ఉండేందుకు, విశ్వాసులను బలపర్చడానికి దృష్టాంతంగా ఉండేందుకు (రోమా 15:4) అనుమతించాడు.

**ఇ) ఐదవ దృశ్యం (2:7–10)**

**ఊజుదేశం, యోబు ఆరోగ్యం కోల్పోవుట, యోబు భార్య విచారం వ్యక్తం చేయుట:**

విశ్వాసులు దేవుని చిత్తానుసారమైన శ్రమల గుండా వెళ్తున్నప్పుడు బంధువులు మరియు స్నేహితుల ప్రతిస్పందన ఎలా ఉంటుందో ఈ భాగం తెలియజేస్తుంది. 2:9లో యోబు భార్య రంగప్రవేశం చేస్తుంది. ఆవిడ రావడంతోనే యోబుపై ఎలా విరుచుకొని పడుతుందో గమనించాలి. సహపాటిపాలిభాగస్తురాలే భర్త బాధల్లో సహకరించి ఆదరించాలి. యోబు, సందర్భానికి తగినట్లుగా భార్యను సంబోధిస్తూ, "మూర్ఖురాలు మాటలాడునట్లు నీవు మాటలాడు చున్నావు" అంటూ కాస్త కఠోరంగానే బుద్ధి చెప్పాడు (10వ). అవును, భార్యలు భర్తలకు అన్ని విషయాల్లో సాటియైన సహాయకులుగానే ఉండాలి. భర్త సాధక బాధకాల్లో సహకరించాలి. యవ్వనకాలంలో చేసిన పెళ్ళి నాటి ప్రమాణంను మరచిపోకూడదు. అదే సహకారం భర్తల వైపు నుండి కూడా ఉండాలి సుమా!

**2. సంభాషణ రూపంలో వ్రాయబడిన పద్యభాగం (2:11–42:6)**



**ఎ) ఆరవ దృశ్యం : పట్టణపు దిబ్బ (2:11–37:24)**

**1. యోబు స్నేహితులు అర్థం చేసుకోలేక పోవుట (2:11–13) :** 2:11–13 వచనాల్లో, యోబు ముగ్గురు స్నేహితులు వచ్చి యోబు పరిస్థితిని చూశాక, ఒక్కమాటైన పలుకక, ఏ విధంగా 7 దినాలు మౌనంగా చూస్తూ కూర్చుండి పోయారో గమనించగలం. ఆ తరువాత 3–14 అధ్యాయాల్లో, యోబు పరిస్థితి గురించి మొదటి చర్చ జరగడం మనం చూడగలం.

**2. యోబు – ఎలీఫజు, బిల్దదు, జోఫరుల మధ్య భేటీ (3:1–32:1) :** 3వ అధ్యాయంలో యోబు తాను పుట్టిన దినాన్ని శపిస్తూ 3:35లో "ఏది వచ్చునని నేను బహుగా భయపడితినో అదియే నాకు సంభవించుచున్నది. నాకు భీతి పుట్టించినదే నా మీదికి వచ్చుచున్నది" అన్నాడు. దీనిని బట్టి, మనకు సంభవించేవన్ని మన ఆలోచనా విధానంపై ఆధారపడి ఉన్నవనుకోవడానికి వీలులేదు. యోబు శ్రమల వెనుక దేవుని ప్రత్యేక ఉద్దేశం వుంది.

4–5 అధ్యాయాల్లో యోబు స్నేహితుల్లో ఒకరైన ఎలీఫజు ఈ చర్చలో మాట్లాడటం ఆరంభించాడు. ఒక విధంగా ఎలీఫజు మాట్లాడే విధానం సరైనదే. 5:17లో అంటాడు, "దేవుడు గద్దించు మనుష్యుడు ధన్యుడు. కాబట్టి సర్వశక్తుడగు దేవుని శిక్షను తృణీకరించకుము" ఇది ఎంతైనా వాస్తవమే, కాని ఈ మాట యోబుకు ఏ మాత్రం వర్తించదు. ఎందుకంటే ఈ మాట పలకడంలో ఎలీఫజు ఉద్దేశం "యోబు పాపం చేశాడు కాబట్టే దేవుడు శిక్షస్తున్నాడు". ఇలా 4, 5, 15, 22 అధ్యాయాల్లోను అదే వాదనగా, యోబు చేసిన పాపమే తాను అనుభవిస్తున్న శ్రమ, బాధకు కారణం అంటూ, సంబంధం లేని సంభాషణ చేస్తూ వచ్చాడు. ఆ మాటలు యోబుకు ఏ మాత్రం సహాయపడలేకపోయాయి. ఇతరుల బాధకు కారణమేమో అవగాహన లేకుండ ఇచ్చే సలహాలు వ్యర్థమే.

6–7 అధ్యాయాల్లో యోబు ఎలీఫజుకు బదులిస్తూ 6:6 లో అన్నాడు, నీ మాటలు గుడ్డులోని తెల్లసొనలా చవి, సారం లేకుండా ఉన్నాయి. ఉప్పులేని పప్పులా నిరుపయోగమే కాకుండా పైగా మనసును నొప్పించేలా ఉన్నాయి అన్నట్లు బదులిచ్చాడు. మనం ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు, సలహాలు ఇస్తున్నప్పుడు, పైకి బాగానే వింటున్నట్లు ఉన్నా, వారు లోలోపల నొప్పించబడుతున్నారేమో జాగ్రత్త! (కొలస్సి 4:6).

బిల్దదు మాట్లాడుతూ; యోబు చేసిన తప్పు ఒప్పుకోవడం లేదు, అందుకే ఇంత శ్రమ అనుభవిస్తున్నాడు అంటూ బాధను మరికాస్త అధికంచేసాడు 8:1–3 లో దేవుడు న్యాయము తప్పడు అంటూ సరైన మాటలే పలుకుతూ వచ్చాడు గాని, ఆ మాటలు సందర్భరహితమైనవి, యోబుకు సంబంధించినవి కావు.

11వ అధ్యాయంలో జోఫరు లేచి అన్నాడు "యోబు చేసిన పాపానికి ప్రస్తుతం అనుభవిస్తున్న శ్రమకంటే మరింత ఎక్కువగా శ్రమపెట్టబడవలసి ఉంది అంటూ, యోబును రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడాడు.

యోబు నిజ పరిస్థితిని అతని ముగ్గురు స్నేహితులు సరిగా గ్రహించలేక పోయారు. పైగా వారేదో దేవుని పక్షంగా వాదిస్తున్నట్లు తమ్మునుతాము కనుపరచుకోబోయారు. అయితే యోబు, నాకు ఈ శ్రమ ఎందుకు కల్గిందో సరైన కారణం మీరు చెప్పలేక పోతే, దయచేసి మీరు మౌనంగానే ఉండండి. నేను దేవున్నే అడిగి తెలిసికొంటాను అంటూ బదులిచ్చాడు. సరైన సలహా కోసం ఎదురు చూసే వ్యక్తి ఎప్పటికైనా దేవున్ని ఆశ్రయించడమే మేలు (కీర్తనలు 118:8).

15–21 అధ్యాయాలలో తిరిగి రెండవసారి చర్చకొనసాగింది. చర్చనీయాంశం, "నీతిమంతులకు శ్రమలెందుకు?" కాని యోబు స్నేహితులు ఈ అంశాన్ని కాస్త "నీతిమంతుడైతే శ్రమలెందుకు?" అని మార్చేసారు. అంటేవారి ఉద్దేశం యోబు పాపంచేసాడు కాబట్టి, శ్రమలు అనుభవిస్తున్నాడు. అయితే ఈ చర్చల్లో స్నేహితులు మాట్లాడే విధానం సరైన విధంగా ఉన్నట్లే కన్పించినా, ఆ చర్చనీయాంశానికి తగిన జవాబు చెప్పలేక పోయారు. కాని యోబు మాత్రం తనకు ఈ శ్రమ ఎందుకు కల్గిందో అర్థం చేసికోలేకపోయినప్పటికి, వారికి జవాబు ఇస్తూ ఆణిముత్యం లాంటి ఒక సత్యాన్ని చెప్పాడు. **యోబు 19:25–27**. ఈ మాటలు తప్పక మనం జ్ఞాపకం చేసికొని తీరాలి.

**"అయితే నా విమోచకుడు సజీవుడనియు, తరువాత ఆయన భూమి మీద నిలుచుననియు, నేనెరుగుదును. ఈలాగు నా చర్మము చీకిపోయిన తరువాత శరీరముతో నేను దేవుని చూచెదను. నామట్టుకు నేనే చూచెదను. మరి ఎవరును కాదు నేను కన్నులారా ఆయనను చూచెదను".**

ఎటువంటి విశ్వాసంతో, ఎంత గొప్ప నిరీక్షణతో నిశ్చయతతో కూడిన మాటలివి! 'పునరుత్థానం' గురించి అంతగా అవగాహన లేని ఆ దినాల్లో యోబు తన విశ్వాసాన్ని అంత పటిష్టపరచి మాట్లాడుతున్నపుడు, యేసు మరణము, పునరుత్థానంతో పాటుగా, విశ్వాసుల పునరుత్థానం గురించి ఇంతకాలంగా వింటున్న, చదువుతున్న నీలో, ఇట్టి నమ్మకం ఉన్నదా? ప్రభువు నీ విమోచకుడని, ఆయనే నిన్ను రక్షించాడని, ఈ భూలోక జీవితంలో నీ చర్మము చీకిపోయిన తరువాత, అక్షయమైన దేహముతో ఆ దేవునిని చూస్తాను అనే శుభ నిరీక్షణ నీలో ఉన్నదా?

22-31 అధ్యాయాలలో యోబు స్నేహితులు తిరిగి 3వ సారి చర్చ కొనసాగించారు. ప్రతి ఒక్కరి సంభాషణకు ఒక ప్రక్క తన నిరసన తెలియజేస్తూనే యోబు ఎంతో సహనంతో బదులిస్తూ ఉన్నాడు. ఈ భాగంలో గమనించదగిన ఒక వచనం. యోబు 28:28. **యెహోవాయందలి భయభక్తులే జ్ఞానం. దుష్టత్వం విడచుటే వివేకం.**

**3. యోబుకు ఎలీహూకు మధ్య భేటీ (32:2-37:24)**

ఈ అధ్యాయాల్లో ఎలీహూ అనే యౌవనస్తుడు మాట్లాడుతూ, దేవుడు యోబును మలచడానికి శ్రమలకు అనుమతించాడు అని తేల్చిచెప్పేశాడు. అనుమతించిన దేవుని ఉద్దేశానికి, అనుగుణంగా లేదు. వారేమో యోబు పాపం చేసాడు కాబట్టి, తన గత పాప ఫలితంగా ఈ శ్రమలను అనుభవిస్తున్నాడు అని వాదించగా, ఎలీహూ ఒక క్రొత్త ధోరణిలో యోబుకు శ్రమ రావడం బట్టి పాపం చేస్తున్నాడు అని సూచించాడు. అనగా ఎలీహూ ఉద్దేశం, యోబు తానేమి తప్పు చేయ్యలేదని, (33:10-11) దేవుడే నా మీద తప్పులు పట్టించుటకు సమయము వెదకుచున్నాడు, నా కాళ్ళను బొండలో బిగించాడు అంటూ, తనను తాను సమర్థించుకుంటూ, దేవునిపైనే నేరారోపణ చేస్తున్నాడు. కాబట్టే ఈ విషయంలో 'యోబు పాపం చేసిన వాడయ్యాడు' అన్నాడు. నిజానికి యోబు ఏ మాట పలికినా తను భరించలేనంత బాధను వ్యక్తపరచే ఉద్దేశంతో మాట్లాడుతున్నాడేగాని, దేవునిపై నేరారోపణ చెయ్యాలనే ఉద్దేశంతో కానేకాదు. కాబట్టే దేవుడు యోబు హృదయాన్నిబట్టి చివరి వరకు నీతిమంతుడు, యథార్థవర్తనుడుగానే చూస్తూ వచ్చాడు. చివరికి యోబుపలికినదే యుక్తమైనదని దేవుడు తేల్చి చెప్పేశాడు.

**బి) ఏడవ దృశ్యం : యెహోవా దేవుడు, యోబుకు మధ్య భేటీ (38:1-42:6) :**

ఈ అధ్యాయాల్లో దేవుడు యోబుతో మాట్లాడే ప్రధాన ఉద్దేశం యోబుకు తన నిజస్థితిని, అసమర్థతను, మానవత్వాన్ని మరియు అతనికి తెలిసింది ఎంత స్వల్పమో చూపించి, అతని తెలివి తక్కువతనాన్ని ఒప్పించేలా చెయ్యాలనేదే. ఈ ఉద్దేశం 42:3-6 లో అక్షరాలా నెరవేరినట్లు చూడగలం. సర్వశక్తుడైన దేవుడు యోబుతో మాట్లాడాక, యోబు తన అసమర్థతను (42:3-6), దేవుని గొప్ప శక్తిసామర్థ్యాలను, ఆయన పరిపూర్ణ న్యాయాన్ని గ్రహించగలిగాడు.

అవును మనం మన నిజస్థితిని గుర్తించాలంటే దేవుని సన్నిధిలో, దేవుడు తన వాక్యము ద్వారా మాట్లాడినప్పుడే సాధ్యపడుతుంది. తద్వారా జీవితంలోని లోటుపాట్లను సరిచేసికోవడానికి, అదెంతో గొప్ప అవకాశం. ఏది ఏమైన ఈ సందర్భంగా మరో ప్రాముఖ్యమైన విషయాన్ని గమనించాలి. మనకు ఏదైనా శ్రమ, బాధ, మనం ఊహించనటువంటి ప్రతికూల పరిస్థితి ఎదురైనపుడు, వెంటనే దేవునిపై కోపగించుకుని, దేవుడు పరిస్థితులన్నిటిని తన స్వాధీనంలో ఉంచుకొంటే... ఈ పరిస్థితి నాకెందుకు రానిచ్చాడు? అంటూ ఎన్నడూ ప్రశ్నించకూడదు ఎందుకంటే మన జీవితంలో సంభవించే ప్రస్తుత పరిస్థితినే చూడగలం కాని రేపు సంభవించేది ఏదో చెప్పలేం, తెలుసుకోలేం. కాబట్టి దేవుని మీద కోపగించుకోవడం, సణగడం, కీడుకే లేక పాపం చెయ్యడానికే కారణంకావచ్చు. అందుకే మనకు అర్థం కాని ప్రతి పరిస్థితి, సమస్య గురించి దేవున్ని అడిగి (దేవునికి ప్రార్థించి) తెలుసుకోవడమే, అలా పరిష్కారం పొందగల్గడమే ఎంతో క్షేమకరం.

**3. ముగింపుగా వ్రాయబడిన గద్యభాగం (42:7-17)**

**ఎనిమిదవ దృశ్యం : ఊజు దేశం, యోబుకు కల్గిన రెండంతల ఆశీర్వాదాలు**

యోబు చివరికి తనకు ఏమీ లేని స్థితిలో, నాకు దేవుడున్నాడు అంతే చాలు అనే గొప్ప పాఠాన్ని నేర్చుకొన్నాడు. శ్రమలు కలిగిన సమయంలో మనం, నా పరిస్థితిలో నా జీవితానికి, నా భవిష్యత్తు అంతటికీ చాలిన దేవుడు నాకు ఉన్నాడు (కీర్తన 73:25) అని జ్ఞాపకం ఉంచుకోవాలి. మరో విషయమేమంటే దేవుడు మనకు ఆశీర్వాదాల్ని రానిచ్చినా లేక శ్రమలనే అనుమతించినా మనం మాత్రం హృదయ పూర్వకంగా ఆయనను ప్రేమించాల్సిందే. శ్రమల ఫలితం తుదకు దేవునితో సన్నిహిత సంబంధానికే దారి తీస్తుంది. కాబట్టి శ్రమలు ఎదురైనపుడు వాటిని సహించినట్లైతే (యాకోబు 5:11) అంతంలో దేవుడు వారికి తప్పక ప్రతిఫలాన్ని పొందే ధన్యతనిస్తాడు (హెబ్రీ 10:35). దేవుడు యోబును, రెండంతల ఆస్తి పాస్తులు, ఐశ్వర్యాలతో ఆశీర్వదించడమే కాకుండా, తన కుటుంబాన్ని కూడా (సౌందర్యవంతమైన కుమార్తెలు, కుమారులతో) తిరిగి సమకూర్చాడు. అంతకు ముందున్న దానికంటె, వాటికంటే అత్యధికంగా యోబు పొందుకున్నాడు. అవును ఎవరైతే పరిస్థితులను అధిగమమించి, దేవునియందే నిరీక్షణ యుంచి, గట్టి నమ్మకం కలిగి జీవిస్తారో అట్టి వారిని దేవుడు తప్పక ఆశీర్వదిస్తాడు.

## III. యోబు గ్రంథం ద్వారా నేర్చుకోవలసిన 4 ముఖ్యాంశాలు :

**1. దేవుని మంచితనం :**దేవుడొక్కడే మంచివాడు. కాబట్టి ఆయన అందరికి మంచినే చేస్తాడు. అయితే ఆయన మంచితనం అందరికి మనం అనుకున్నట్లు, మన విధానంలో చూపించకపోవచ్చు. మంచిగా జీవించేవారు కష్టాలు, బాధలు, శ్రమలు

అనుభవించడం ఏమిటి? అని, యోబు నిరాశచెందినపుడు, దేవుడు యోబుతో మట్లాడాడు. తన అమితమైన శక్తిని, అనంతమైన జ్ఞానాన్ని చూపించాడు. చివరకు తన మంచితనాన్ని కనుపరచాడు.

కొన్నిసార్లు మన పరిస్థితిని బట్టి, దేవుడు మనకు చాలా దూరంలో ఉన్నాడేమో, మనల్ని ఏం పట్టించుకోవడంలేదేమో అనిపిస్తుంది. ఇక దేవుని భద్రత, కాపుదలపై అనుమానాలు మొదలవుతాయి. ఇటువంటి సమయంలో ఒక ప్రాముఖ్యమైన సంగతి గమనించాలి. **"మనం దేవున్ని నమ్ముకొని, సేవిస్తున్నాం అంటే, ఆయన ఎవరై ఉన్నాడోనని గుర్తెరిగేగాని, ఆయన్ని మనం ఎలా ఊహించుకుంటున్నామో దాన్ని బట్టి కానేకాదు"**. మన దేవుడు బాధలలో చూస్తూ ఊరకునేవాడు కాదు. నిజానికి మన సమస్తబాధల్లో సహానుభవము కలిగినవాడు. కాబట్టి మన బాధలను అర్థం చేసికోగలడు, తగిన సహాయాన్ని అందించి ఆనందింపజేస్తాడు. పరిస్థితిని బట్టి శిక్షకు అనుమతించినా తిరిగి ప్రేమించి తన మంచితనాన్ని కనుపరచేవాడు (హెబ్రీ 12:5). అట్టి మంచి దేవుని నుండి ఎట్టి పరిస్థితిలో దూరంకాక, ఆయన్నే వెంబడిస్తూ, ప్రేమిస్తూ ఆయనపైనే ఆనుకొని జీవించాలి.

**2. సాతాను దాడి :** వీడి దాడి అంతా మొదట విశ్వాసులపైనే. వారిని విశ్వాసంలో నుండి దిగ జార్చి విశ్వాసకర్త అయిన దేవునిపైనే సందేహం కల్గించి, చివరకు ఆ వ్యక్తిని నాశనం చేయడమే వాడి ప్రధాన ధ్యేయం.

ఇక్కడ యోబు విషయంలో వాడు చేసిన పని అదే... దేవునికి "ఏ విధమైన నీతి, న్యాయం, మంచితనం లేదు" అని దేవునిపై అనుమానం, విరక్తి కల్గించి యోబును దేవునికి దూరం చేయాలని విఫలయత్నం చేసాడు. అయితే దేవుడు అనుమతించిన మేరకే వాడు మనల్ని శోధిస్తాడు. గనుక వాడి దాడికి భయపడాల్సిన పనే లేదు. కాబట్టి మీరు ఏ పరిస్థితిలోనైనా ఏ శ్రమానుభవంలో ఉన్నా, దేవున్ని సందేహించకండి.

**3. నమ్మికయుంచడం :** విశ్వాస జీవితానికి మూలాధారం నమ్మిక. విశ్వాసకర్త యేసు ప్రభువును నమ్ము ప్రతి వానికి రక్షణ. ప్రభువు మార్కు సువార్త 9:23లో – **"నమ్ముట నీవలననైతే నమ్మువానికి సమస్తం సాధ్యం"** అన్నాడు. యోబు అట్టి నమ్మిక కోల్పోకుండా అంతం వరకు సహించి, ఓర్పువహించి, కోల్పోయిన సమస్తాన్ని సాధించాడు – రెండంతల ఆశీర్వాదాన్ని పొందాడు. యోబు శ్రమల వెనుక ఉన్న ఉద్దేశం దేవునికి మాత్రమే తెలుసు. అయినా యోబుకు ఎన్నడు ఈ సంగతి చెప్పలేదు. మరోవైపు ఒక సాధారణ మానవుడు భరించలేనంత శ్రమ, బాధ భరిస్తూ కూడా యోబు ఏనాడు దేవున్ని అనుమానించలేదు. తన సామర్థ్యం, తనకున్న గొప్ప అనుభవం మీద గాని నమ్మిక ఉంచలేదు గాని యోబు దేవునిపైనే దృష్టి సారించాడు.

**4. శ్రమలు :** శ్రమలు అందరికి వస్తాయి. ప్రత్యేకించి ఈ పాప లోకంలో పరిశుద్ధులుగా జీవించాలని ప్రయత్నించేవారికి, అలా జీవిస్తున్న ప్రతి ఒక్కరికి, ఆయా సమయ సందర్భాల్లో అనేక విధాలుగా సంభవిస్తూ ఉంటాయి. ఒక వేళ మనం చేసిన పాపము బట్టి, లేక ఇతరుల పాపము బట్టి, సరైన ముందు జాగ్రత్త తీసికొనక పోవడం బట్టి స్వాభావికంగానో, భౌతికంగానో లేక ఎన్ని జాగ్రత్తలు తీసికొన్నా తప్పనిసరిగానో శ్రమలు సంభవించే అవకాశాలున్నాయి.

ఇక్కడ యోబు ఏ తప్పిదం చేయకపోయినా శ్రమ సంభవించింది. అయితే, యోబు బాధ అంతా, కోల్పోయిన సమస్తాన్ని బట్టి కానే కాదుగాని, దేవుడు ఎందువలన ఇంత శ్రమ నాకు అనుమతించాడు అనేది అర్థంకాక పోవుటవలననే. ప్రతి శ్రమ పాప ఫలితమే అని భావించకూడదు. అదే విధంగా మనకు కలిగే ప్రతి అభివృద్ధి, మనం మంచిగా జీవిస్తున్నందుకు ప్రతిఫలమే అని తలంచకూడదు. ఇక దేవున్ని ప్రేమించేవారందరికి ఎన్నడు శ్రమలు రావు అని భ్రమించకూడదు. మనకు కలిగిన శ్రమను బట్టి, మనం అనుభవిస్తున్న బాధ ఎందుకో అనేది మనకు పూర్తిగా అర్థంకాకున్నా, ఆ బాధ, శ్రమ దేవున్ని గురించే తిరిగి ఆలోచింపచేసేదిగా చేస్తుంది. దేవునికి బహు సమీపస్తులుగా తీసికొని వస్తుంది. **"దేవున్ని ప్రేమించే వారికి... మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి"** (రోమా 8:28).

**శ్రమలు – వారి వారి ఉద్దేశాలు :**

1. **సాతాను ఉద్దేశం :** "ప్రజలు వర్ధిల్లుతుంటేనే దేవునియందు నమ్మిక ఉంచుతారు గాని, శ్రమలు వస్తే నమ్మిక ఉంచలేరు". ఇది తప్పుడు ఉద్దేశం.
2. **యోబు ముగ్గురు స్నేహితుల ఉద్దేశం :** "చేసిన పాపానికి దేవుని తీర్పే (శిక్షే) శ్రమలు". ఇది వాస్తవమే అయినప్పటికి, ప్రతిసారి ఇది నిజం కాదు.
3. **యౌవనస్తుడైన ఎలీహు ఉద్దేశం :** "శ్రమలు, దేవుడు మనకు ఏదైనా ఒక పాఠం నేర్పేందుకో, మనల్ని క్రమశిక్షణలో పెట్టేందుకో, మనల్ని మరింత మేలిమి చేసేందుకో ఆయన ఉపయోగించే విధానం." ఈ ఉద్దేశం సరైనదే కాని ఇది అసంపూర్ణ వివరణ.
4. **దేవుని ఉద్దేశం :** "విశ్వాసి జీవితం మెరుగు పెట్టబడాలని, విశ్వాసి తన స్వరూపంలోనికి మార్చబడాలని, విశ్వాసి విశ్వాసం పటిష్టం కావాలని, ఎట్టకేలకు

ఆ విశ్వాసి పరలోకంలో చేరాలనేదే" ఆయన ఉద్దేశం. దేవుడు ఎవరై ఉన్నాడు అనే దాన్ని బట్టే ఆయనయందు నమ్మిక ఉంచడానికి శ్రమలు దోహదపడతాయి గాని ఆయన ఏం చేస్తాడు? అనేదాన్ని బట్టికాదు.

## IV. నీకు ఎప్పుడైనా శ్రమ సంభవిస్తే...?

నీకు ఎప్పుడైనా శ్రమ సంభవిస్తే, వేసికోవలసిన ప్రశ్నలు – జవాబు "అవును" అయినట్లైతే అపుడు స్పందించవలసిన విధానాలు.

**ప్ర1. దేవుడు నాకు ఈ శిక్ష రానిచ్చాడంటే నేనేదైనా పాపం చేసానా?**

జ. ఆ సందర్భంగా నీవు పాపము చేసివుంటే నీకు తెలిసిన ఆ పాపం వెంటనే ఒప్పుకో–విడచిపెట్టు.

**ప్ర2. నేను క్రైస్తవునిగా జీవిస్తున్నందుకు సాతాను నా మీద దాడి చేస్తున్నాడా?**

జ. బలం కొరకు దేవునికి ప్రార్థించు.

**ప్ర3. శ్రమలో ఉన్నవారిని ఆదరించే పరిచర్యకు సిద్ధపరచేందుకా, నాకు ఈ శ్రమలు?**

జ. ఇటువంటి పరిస్థితిలో మొదట నీపై నీవే జాలిపడిపడటాన్ని మానాలి. ఆ తరువాత ఆ శ్రమలు అనుభవించే పరిస్థితిని ఒక అదనుగా చేసికొని నావలె శ్రమలు అనుభవిస్తున్న వారిని ఆదరించునట్లు వారిని నాకు చూపించు అని ప్రార్థించాలి.

**ప్ర4. ఒకవేళ యోబువలె నేను కూడా పరీక్షింపబడేందుకు ఏర్పాటు చేయబడ్డానా?**

జ. వెంటనే నీ సంఘంలో తోటి విశ్వాసుల (సంఘ) ప్రార్థనలను కోరాలి. ఆ పరిస్థితిలో దేవుడు నా పట్ల ఏదో మంచి (ప్రత్యేక) ఉద్దేశ్యాన్ని కలిగి ఉన్నాడు అని దేవునియందు నమ్మకం ఉంచాలి.

**ప్ర5. నాకు ఎదురైన ఈ శ్రమ నిష్కారణంగా, సహజ సిద్ధంగా వచ్చిందా?**

జ. ఈ పాపలోకంలో మంచివారు, చెడ్డవారు ఇరువురు శ్రమలు అనుభవిస్తున్నారు అనేది మొదటి గుర్తించాలి. అయితే మంచివారికి కలిగే శ్రమలకు ఒక అర్థం ఉన్నది, వాటికి అంతమున్నది, అవి కొంత కాలం మాత్రమేనని, ఆ తరువాత వారు స్థిరపరచబడి బలపర్చబడేందుకు వారికి దేవుని వాగ్దానమున్నదని గ్రహించాలి.

**ప్ర6. ప్రార్థించినా, నాకు వచ్చిన శ్రమకు కారణమే తెలియడంలేదే?**

జ. అలాంటపుడు నీలో నీవే కుమిలిపోక, దేవునియందలి విశ్వాసాన్ని ప్రకటించు (దేవునియందు విశ్వాసం ఉంచు) ఆయన నీ గురించి చింతించేవాడు, శ్రద్ధ వహించేవాడు, అని తెలుసుకొని ఆయన సహాయం కొరకు ఓపికతో కనిపెట్టు, తద్వారా నీకు మేలే జరగడం మినహా మరే కీడు, హానీ అనవసరంగా కలుగదు. ఆ శ్రమలో రోమా 8:28 ప్రతి సారి జ్ఞాపకం చేసికోవాలి.

ఈ సందర్భంగా ఒక్క విషయాన్ని మనం ఎప్పటికి జ్ఞాపకముంచుకోవాలి. బాధలు, కష్టాలు, శ్రమలతో కూడిన ఈ జీవితమే, మన అంతిమ గమ్యం కాదు. నిత్యజీవితముతో కూడిన నిరీక్షణ మనకుంది. ఈ భూమ్మీద మనం ఏమి కోల్పోయినా, ఆ నిరీక్షణను కోల్పోకూడదు. కాబట్టి, ఈ కొద్దికాల జీవితంలో ఎన్ని పరీక్షలు ఎదురైనా, ఆ గొప్ప నిరీక్షణకు ఆధారమైన దేవుని యందే నమ్మిక ఉంచి, అనంతకాల ఆనందం కోసమే ముందుకు సాగిపోవుటకు కృపగల ప్రభువు సహాయం చేయునుగాక!







